ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడో?



టెంబ్రిగూడలో నిర్మాణ దశలో ఉన్న ఇల్లు

- తాత్కాలిక గుడిసెల్లో జీవనం కొనసాగిస్తున్న పీవీటీజీలు
- వర్షాకాలం సమీపిస్తుండడంతో ఆందోళనలో లబ్ధిదారులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ గిరిజనుల్లో ఆర్థికంగా అత్యంత వెనుకబడి ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని పీవీటీజీ లబ్ధిదారులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగానే 2022–23 ఆర్థిక సంవత్సరంలో సీసీడీపీ నిధులతో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆదిలాబాద్ రూరల్, జైనథ్, బేల మండలాల్లోని లబ్ధిదారులకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు ఐటీడీఏ అధికారులకు ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్‌లను సైతం జారీ చేసింది. దీంతో ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. కానీ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

నియోజకవర్గానికి 133 గృహాలు..

సీసీడీపీ పథకం కింద పీవీటీజీలకు ఆదిలాబాద్ నియోజకవర్గానికి 133 గృహాలు మంజూరయ్యాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మూడు గ్రామాలకు 31 గృహాలు, బేల మండలంలోని 14 గ్రామాలకు 80 గృహాలు, జైనథ్ మండలంలోని నాలుగు గ్రామాలకు 12 గృహాలు, మావల మండలంలోని రెండు గ్రామాలకు 10 గృహాలు మంజూరయ్యాయి. రూ.2.50 లక్షల వ్యయంతో 10 ఫీట్ల వెడల్పు, 15 ఫీట్ల పొడవులో ఇంటి నిర్మాణం, మరుగుదొడ్డి, స్నానపు గదులను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

తాత్కాలిక గుడిసెల్లో జీవనం

ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఆదిలాబాద్ రూరల్ మండలం జంబుల్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలో గల అడ్డగుట్ట, బేల మండలంలోని టెంబ్రిగూడ, ఉపసనాలా, వరూర్, దుబ్బగూడ, మాసాల, దేవాపూర్, రాయ్‌పూర్, తదితర గ్రామాల్లో పీవీటీజీలకు పక్కా ఇండ్లు మంజూరయ్యాయి. దీంతో ఇళ్ల నిర్మాణం జరుగుతుందనే ఆనందంలో లబ్ధిదారులు వారికి ఉన్న ఇండ్లను తొలగించి ప్రస్తుతం తాత్కాలిక గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వివిధ కారణాలతో పలు గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలలో తీవ్ర జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. మరో వారం రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందువల్ల ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తికాకపోతే వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులుపడే ప్రమాదం ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షాలు ప్రారంభం కంటే ముందుగానే ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా చొరవ తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయంపై ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా జూన్ మొదటి వారం లోగా అన్ని చోట్ల ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో భాస్కర్

ఇంద్రవెల్లి: ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు, కూలీల సంఖ్య, పారిశుద్ధ్య పనులు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఎంపీవో జీవన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న డీపీఎం శేషారావ్

బోథ్: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీపీఎం శేషారావ్ అన్నారు. బుధవారం ఐకేపీ భవనంలో మహిళా సంఘాలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రమేశ్, ఏపీఎం మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవిగ్రహ ప్రతిష్ఠాపనకు ధమ్మదానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని బుద్ధవిహార్‌లో ఈ నెల 29న నిర్వహించనున్న బుద్ధ విగ్రహ ప్రతిష్ఠాపనకోసం బుధవారం ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ సర్పంచ్ చౌహాన్ సునీత, మాజీ ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొడప జాలైజాకు, ఎంపీటీసీ జాహెద్ ధమ్మదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సోన్‌కాంబ్లె కృష్ణకుమార్, కిల్లరే అరుణ్, నర్వడే రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ధ్వంసం దుండగులను శిక్షించాలి



ఫిర్యాదు చేస్తున్న ఆర్యవైశ్యులు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో శనివారం రాత్రి మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి శిక్షించాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం భీంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాజు, సభ్యులు హరీష్, సంతోష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికే కూలి అందాలి



కుమారిలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: ఉపాధిహామీ పథకంలో పనిచేసిన కూలీలకే కూలి డబ్బులు అందేలా చూడాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. బుధవారం మండలంలోని కుమారిలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. పనులకు రాకుండా కూలీ తీసుకుంటే తమకు సమాచారం అందిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

24న ఉచిత వైద్యశిబిరం

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో ఈ నెల 24న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వైద్యసేవలు అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాడుదాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎదులాపురం: పర్సా సత్యనారాయణ స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకు పోరాడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో బుధవారం కార్మిక ఉద్యమ నేత పర్స సత్యనారాయణ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం దోపిడీ వ్యవస్థ పీడనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రధాన భూమిక పోషించారన్నారు. కార్మిక వర్గం అంతా ఆయనను స్ఫూర్తిగా తీసుకొని హక్కుల సాధనకు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, జిల్లా కోశాధికారి కే.సునీత, జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి)లో రేణుకామాత ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రంగాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారిని మొదట అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో అర్చన, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు గంగయ్య, ఆలయ భూదాత అన్నం రాజన్న, ఎంపీటీసీ రాకేష్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. అ

సకారాం నాయక్‌కు ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని తన్ననాయక్‌తండా (చిన్నరాజుర) గ్రామానికి చెందిన సకారాం నాయక్ ఇటీవల మృతి చెందాడు. బుధవారం తేర్వి కార్యక్రమం ఉండడంతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆడె రాంచందర్, తదితరులు ఉన్నారు.

'విద్యాశాఖలో ఖాళీలు భర్తీ చేయాలి'



మాట్లాడుతున్న పర్వతి సత్యనారాయణ

ఎదులాపురం: విద్యాశాఖలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, టెట్‌పై స్పష్టత ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఆర్టీయూ నాయకులు నూర్‌సింగ్, మోహన్‌సింగ్, ముజీబ్, రవిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

'దొడ్డు రకాలకు బోనస్ ఇవ్వాల్సిందే'



నిరసనలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, రైతులు

ఖానాపూర్: ఎన్నికల వేళ వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక కేవలం సన్నరకం వడ్లకే బోనస్ ఇస్తామని నిర్ణయించడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పిలుపు మేరకు ఖానాపూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయకుంటే రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజగంగన్న, రాము నాయక్, అబ్దుల్ కలీల్, గౌరికార్ రాజు, ప్రదీప్, లింగన్న, బీసీరాజన్న, మురళి, సుమిత్, చంద్రహాస్, శేఖర్, సుమన్, మహేందర్, ప్రశాంత్‌రెడ్డి, మనోజ్, భీమన్న తదితరులు ఉన్నారు.

వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బుధవారం కుటుంబ సమేతంగా జమ్మూకశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనగర్‌లోని చారిత్రక లాల్‌చౌక్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన పలు పకడ్బందీ చర్యల వల్ల లాల్‌చౌక్ ప్రాంతాల్లో నేడు స్వేచ్ఛాపూరిత వాతావరణం నెలకొందన్నారు. ప్రజలు ప్రశాంత జీవనం గడుపుతున్నారన్నారు.

రిమ్స్ వైద్యుడికి మైల్డ్ హార్ట్‌స్ట్రోక్

కైలాస్‌నగర్: రిమ్స్ వైద్యుడు, రేడియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ కళ్యాణ్ రెడ్డి బుధవారం మైల్డ్ హార్ట్‌స్ట్రోక్‌కు గురయ్యారు. ఉదయం విధులకు హాజరైన ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు రిమ్స్ వర్గాలు వెల్లడించాయి.

తాపీమేస్త్రీల కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ఉట్నూర్‌రూరల్: తాపీమేస్త్రీల మండల కార్యవర్గాన్ని బుధవారం సంఘం గౌరవ అధ్యక్షుడు గొల్లపెల్లి నర్సయ్య అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాడి రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా నర్సయ్య, మాధవ్, ప్రధాన కార్యదర్శులుగా పెరుమల్ల వెంకటేశ్, కరాడి భూమన్న, సంయుక్త కార్యదర్శులుగా గైక్వాడ్ మహేందర్, గోదరి లక్ష్మీపతి, జిల్లపల్లి దుర్గయ్య, కోశాధికారులుగా బండారి పోశన్న, రవి, సభ్యులుగా గంగాధర్, జైపాల్, సాగర్, రమేశ్, భూపతి, రాజేశ్వర్, భూమన్న, రాజన్నను ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌అర్బన్ మండలంలోని 33/11 కేవీ రిమ్స్ సబ్‌స్టేషన్, కలెక్టర్ చౌక్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ డి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిల్టర్‌బెడ్, ఓల్డ్ హౌజింగ్ బోర్డు, ఎన్టీఆర్ చౌక్, కలెక్టర్ చౌక్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తలమడుగు ఎస్సై బదిలీ



ఎస్సై ధనశ్రీ

తలమడుగు: తలమడుగు ఎస్సై ధనశ్రీ బదిలీ అయినట్లు ఏఎస్సై సురేందర్ బుధవారం తెలిపారు. తలమడుగు మండలంలో రెండేళ్ల పాటు విధులు నిర్వహించి బదిలీల్లో భాగంగా హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయానికి బదిలీ అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్‌చార్జీ ఎస్సైగా ఏఎస్సై సురేందర్ బాధ్యతలు స్వీకరించారు.

'25 కేవీ డీటీఆర్ ఏర్పాటు చేయాలి'

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్‌లో 25 కేవీ డీటీఆర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం 15 కేవీ డీటీఆర్‌కు విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేసి మళ్లీ బిగిస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. 15 రోజులకే మళ్లీ చెడిపోతుందని, ఎక్కువ సామర్థ్యంగల డీటీఆర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు షేక్ యాసార్, మీర్జా జీలాని బేగ్, ముండే గణేశ్, ముండే బాలు, షేక్ ఫెరోజ్, ఆత్మారాం, తదితరులు పాల్గొన్నారు.

'మోసపూరిత హామీలతో వంచన'

ఎదులాపురం: బీజేపీ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అన్ని వర్గాలను వంచన చేసిందని సీపీఎం సీనియర్ నాయకులు లంకా రాఘవులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు, రాజకీయ పరిస్థితులు, ఎన్నికలు తదితరాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. దేశంలో పదేళ్ల పాటు బీజేపీ పాలన సాగించినా ఏ వర్గానికి కూడా న్యాయం చేయలేదన్నారు. ధరలను నియంత్రిస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని ప్రకటించి మోసం చేశారన్నారు. ప్రస్తుత రాజకీయాలు, ఎన్నికలు, సీపీఎం పాత్ర లాంటి అంశాలపై కార్యకర్తలకు శిక్షణాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భీంరావ్, దత్తాత్రి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలు?

నేరడిగొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం, రాజకీయ నాయకుల జోక్యంతో ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని కూలీలు ఆరోపిస్తున్నారు. పంట పొలాలకు వెళ్లేందుకు మట్టిరోడ్లు, అటవీ ప్రాంతంలో నీటిగుంతల తవ్వకం పనులు చేపడుతున్నారు. అయితే కొన్ని గ్రూపుల్లోని సభ్యులకు తక్కువ, మిగితా కొందరికి ఎక్కువ కూలీ డబ్బులు వస్తున్నాయని, ఒకే పనికి సంబంధించి అంతా సమానంగా పనులు చేసినప్పటికీ చెల్లింపుల్లో తేడాలున్నాయని కూలీలు ఆరోపిస్తున్నారు. పనికి రానివారికి సైతం డబ్బులు చెల్లిస్తున్నారని అలాంటివారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొంతమంది అధికారులు పర్సెంటేజీలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా జిల్లా స్థాయి అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తే తప్పా ఇలాంటి బాగోతాలు బయటకు రావడం కష్టంగా ఉందని కూలీలు పేర్కొంటున్నారు.

'బౌద్ధ వందన' విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: బౌద్ధ జయంతి, వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో బౌద్ధ వందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీంరావ్ వాఘ్మరే తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి జిల్లాలోని బుద్ధ ఉపసక్, ఉపసికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మహేష్, పాపయ్య పవార్, ఆకాష్, సూరజ్, గౌతం, అంకిత్, కిరణ్, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయన్న

నార్నూర్: మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలు సద్వినియోగం చేసుకునేలా సీసీలు, వీవోఏలు చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని డీఆర్డీవో సాయన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవోఏలు, సీసీలు, ఏపీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. అవి ప్రతీ మహిళకు అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామస్థాయి సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వం అందించే రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తొలిసారిగా మండలానికి వచ్చిన డీఆర్డీవోను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నీలేష్, ఎంపీడీవో జవహర్, డీపీఎంలు హేమలత, శోభ, శోభారాణి, నరేందర్, సుగంధ, ఏపీఎంలు మాధవి, రమేష్, సీసీలు కె.సంతోష్, కిషన్, ఆర్.సంతోష్, సత్యశీల, శ్రీరామ్, రేవయ్య, తుకారాం, నాందేవ్, అంబారావు, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన

నార్నూర్: మండలంలోని గుండాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన కాలువ పూడికతీత పనులను డీఆర్డీవో సాయన్న పరిశీలించి టీఏ జాదవ్ కైలాస్‌ను అభినందించారు.

'ఉప' ప్రచారంలో ఎమ్మెల్యే అనిల్



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నికల ప్రచారంలో భా గంగా మహబూబాబాద్‌లో బుధవారం ని యోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని మాట్లాడా రు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మ ద్దతుగా అందరూ నిలవాలని కోరారు. ఆ యన వెంట ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ తదితరులున్నారు. అనంతరం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తో ఎమ్మెల్యే అనిల్ భేటీ అయ్యా రు. ఎన్నికలపై ఆయనతో చర్చించారు.

నాణ్యమైన విత్తనాలే విక్రయించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఏ రవీందర్

తాంసి: ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన నాణ్యమైన పత్తి విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని ఇన్‌చార్జి ఏడీఏ రవీందర్ అన్నారు. భీంపూర్‌లో తహసీల్దార్ సత్యనారాయణతో కలిసి మండలంలోని ఆయా విత్తన దుకాణ యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిమాండ్ రకం విత్తనాలు ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు బోర్డుపై ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో ఏఈవో శంకర్, సాయిప్రసాద్, విత్తన దుకాణ యాజమానులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం



బేల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటు వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. పాఠశాల లోపలికి రేషన్ బియ్యం లారీ, ఇతరత్రా వాహనాలు వెళ్తే వాటిని తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలు తొలగించాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు కోరుతున్నారు.